క్లుప్తంగా

శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణం



మద్దికెరలో రోడ్డు నిర్మాణ పనుల్లో కార్మికులు

మద్దికెర: స్థానిక గ్రామ సచివాలయం -1 పరిధిలో టైలర్ హరి ఇంటి వద్ద నుంచి చాకలి సంజప్ప ఇంటి వరకు రూ.4.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విష్ణు, చంద్ర తెలిపారు. బుధవారం వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి వచ్చిన సమస్యలన్నీ సకాలంలో పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కుష్టు నిర్మూలనకు కృషి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం మద్దికెరలోని ప్రభుత్వ వైద్యశాలలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కుష్టు నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వైద్య సిబ్బందికి తెలియ జేయాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని చెప్పారు. ఎండీటీ మందులు వాడితే వ్యాధిని అదుపుచేయవచ్చని వివరించారు. ఈనెల 27 నుంచి జనవరి 12 తేదీ వరకు జరిగే ఇంటింటి సర్వేలో వైద్య సిబ్బంది కుష్టు లక్షణాలున్న వారిని గుర్తించాలన్నారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, ఫార్మసిస్ట్ జ్యోతి పాల్గొన్నారు.

నేడు గాదిలింగప్పతాత రథోత్సవం



పూజలందుకుంటున్న గాదిలింగేశ్వర స్వామి

హాలహర్వి: మండలంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం గూళ్యం గాదిలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం గాదిలింగప్ప తాత 20వ పూల రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు, గ్రామపెద్దలు తెలిపారు. పూల రథోత్సవం వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అలాగే తాత వారి రథాన్ని సుందరంగా అలంకరించారు. రథోత్సవంలో పాల్గొనే భక్తులకు అన్నదానం, మంచినీటి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఆలూరు గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు

ఆలూరు: రాష్ట్రస్థాయిలో విజయనగరం జిల్లా కోనవలసలో గురువారం నుంచి జరగనున్న వివిధ క్రీడా పోటీలకు ఆలూరు గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎంపికై నట్లు పీఈటీ ప్రతాప్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి అండర్-14 ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, త్రోబాల్ విభాగాల్లో 14 మంది ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను ప్రిన్సిపాల్ షాహినూర్ అభినందించారు.

పాఠశాల తనిఖీ



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ-2 మధుసూదన్‌రాజు

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలతో పాటు ఎంపీపీఎస్ న్యూ పాఠశాలలను బుధవారం ఎంఈఓ - 2 మధుసుదన్‌రాజు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పాఠశాల నిర్వహణ తదితర అంశాలపై హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎస్ఎస్‌జీ జట్టు

కోసిగి: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని గ్రౌండ్‌లో వైఎస్సార్‌సీపీ యువనేత వై.ధరణీధర్ రెడ్డి సహకారంతో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో కోసిగికి చెందిన ఎస్ఎస్‌జీ జట్టు విజేతగా గెలుపొందింది. బుధవారం గ్రౌండ్‌లో ఎస్ఎస్‌జీ జట్టు, బ్లాక్ స్క్వాడ్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి. ఇందులో ఎస్ఎస్‌జీ జట్టు విజేతగా, బ్లాక్ స్క్వాడ్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఆయా జట్లకు కప్‌లను కోసిగికు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొరివి నాగరాజు చేతుల మీదుగా అందజేశారు.

మజరా గ్రామానికి మెరిసే రోడ్డు

- రూ.3.12 కోట్లతో ఆర్.కొత్తూరుకు బీటీ రోడ్డు
- గ్రామస్తుల కల సాకారం చేసిన ప్రభుత్వం
- రోడ్డు నిర్మాణంపై హర్షం



అదొక చిన్న మజరా గ్రామం. కంకర తేలి గుంతలు పడిన అధ్వానమైన రోడ్డు. రాకపోకలు సాగించాలంటే నరకప్రాయమే. గత పాలకులు శీతకన్ను వేయడంతో ఏళ్ల తరబడి గుంతల దారిలోనే ఆ గ్రామ ప్రజలు ప్రయాణించే వారు. ఇన్నాళ్లకు వారి కష్టాలు గట్టెక్కాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో బీటీ రోడ్డు నిర్మాణం జరిగింది. గ్రామస్తుల కలను సాకారం చేసింది.

తుగ్గలి: మండల పరిధిలోని రాతన పంచాయతీ మజరా గ్రామం ఆర్.కొత్తూరు. ఏళ్ల తరబడి కంకర తేలి అధ్వానంగా ఉన్న రోడ్డుపై గ్రామస్తులు ఇన్నాళ్లు ప్రయాణం సాగించారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి నాయకులు రోడ్డు వేస్తామని చెప్పి గెలిచిన తర్వాత అటు వైపు చూసేవారు కాదు. రోడ్డంతా అధ్వానంగా తయారైనా పాలకులు పట్టించుకోలేదు. అదిగో రోడ్డు.. ఇదిగో రోడ్డు అంటూ గత ప్రభుత్వంలో పాలకులు గ్రామస్తులను మభ్యపెట్టారు తప్ప రోడ్డు వేసిన పాపాన పోలేదు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఏపీ రూరల్ రోడ్డు కనెక్టివిటీ కింద రూ.3.6 కిలోమీటర్ల మేర రూ.3.12 కోట్లతో ఇటీవల తారురోడ్డు నిర్మించింది. రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో రాకపోకలకు సౌకర్యంగా మారింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రాతన నుంచి ఆర్ కొత్తూరుకు వేసిన తారు రోడ్డు

రహదారి కష్టాలు తీర్చారు



గతంలో రోడ్డంతా గుంతలు పడి నడిచేందుకు కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఊర్లోకి ఆటోలు కూడా వచ్చేవి కాదు. ఎక్కడికి పోవాలన్నా రాతన, పత్తికొండ వరకు నడిచి వెళ్లాల్సి వచ్చేది. అత్యవసర సమయాల్లో చాలా ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తారురోడ్డు వేయడంతో రహదారి కష్టాలు తీరాయి. ఊర్లోకి ఆటోలు వస్తున్నాయి. రోడ్డు నిర్మించడంతో ప్రయాణం తొందరగా సాగుతోంది. రోడ్డు నిర్మించడం పట్ల సంతోషంగా ఉంది.

– హుసేన్‌బీ, ఆర్.కొత్తూరు

ఇన్నాళ్లకు మోక్షం



గ్రామానికి తారు రోడ్డు ఉండాలన్నది మా కల. గుంతలు పడిన రోడ్డులో ఇన్నాళ్లూ అవస్థలు పడ్డాం. రాత్రి వేళ ప్రయాణం మరీ ఇబ్బందిగా ఉండేది. ఎవరైనా ఊరికి రావాలన్నా ఆసక్తి చూపేవారు కాదు. ఎంతో మంది ప్రమాదాల బారిన పడ్డారు. ఎమ్మెల్యే చొరవతో మా వూరికి తారురోడ్డు నిర్మించడం సంతోషంగా ఉంది. ఇప్పుడు సాఫీగా ప్రయాణం సాగుతోంది. జగనన్న ప్రభుత్వం తారురోడ్డు నిర్మించి మా కల నెరవేర్చింది.

– గోపాల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్, ఆర్.కొత్తూరు

పెరిగిన బియ్యం ధర

- క్వింటల్ సోనా మసూరి బియ్యం రూ. 5,200
- ఎల్లెల్సీ కింద రబీ సాగు లేకపోవడంతో ధరపై ప్రభావం



రైస్ మిల్లులో ఆడించిన బియ్యం

హొళగుంద: ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంట దిగుబడి తగ్గడం, ఎల్లెల్సీ కింద రబీకి సాగు నీరు అందకపోవడంతో బియ్యం ధరలు పెరిగాయి. టీబీ డ్యాంపై ఆధారపడిన బళ్లారి, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఈ ఏడాది రబీ పంట లేకపోవడంతో ధాన్యానికి డిమాండ్ పెరిగింది. ఇంతకుముందు సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్ కేవలం రూ.1,800 వరకు ఉండేది. ప్రస్తుతం రూ.2,800 నుంచి రూ.3 వేల వరకు ధర పలుకుతోంది. ప్రతి సంవత్సరం రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి వ్యాపారస్తుల వెంట పడేవారు కాగా ఈ ఏడాది ఆ పరిస్థితి తారుమారైంది.

మెరుస్తున్న బియ్యం..

డిమాండ్‌కు తగ్గ ధాన్యం లేకపోవడంతో గత నెల రోజులుగా బియ్యం ధరకు రెక్కలొచ్చాయి. కొత్త బియ్యం ధర ఇంతకుముందు క్వింటాల్ రూ.3,600 వరకు ఉండేది. అయితే నేడు రూ.5,200 వరకు పెరిగింది. వర్షాభావం కారణంగా మెట్ట భూముల్లో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులు కాలువ కింద సాగు చేసుకున్న ధాన్యాన్ని మిల్లులో బియ్యం ఆడించి అమ్ముకుని కొంతమేర గట్టెక్కారు. కాలువ కింద భూములు లేని రైతులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఇదిలాఉండగా సోనా మసూరి రకం సాగు చేసిన రైతులకు దిగుబడి పరవాలేదనుకున్నా ఆరనర్ రకం పంట మాత్రం ఎకరాకు 45 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా 20 బస్తాలు కూడా రాలేదు. అయితే ధాన్యం ధర రూ.3,200 వరకు ఉండడంతో పెట్టిన పెట్టుబడుల మేర వచ్చినట్లయ్యింది.

హోరాహోరీగా క్రీడాపోటీలు



ఎమ్మిగనూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి



నందవరంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ దశరథరామయ్య



జొన్నగిరిలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం



అమకతాడులో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



వెల్దుర్తిలో టాస్ వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటుకొని ఉన్నతంగా రాణించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. 'ఆడుదాం -ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో రెండో రోజు క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, మేనేజర్ వరప్రసాద్, ఏఈ మదన్, పలు హైస్కూళ్ల పీడీలు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ దశరథ రామయ్య, మాచాపురం గ్రామ సర్పంచ్ కిష్టప్ప చేతుల మీదుగా క్రీడా పోటీలను ప్రారంభించారు.ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, సూపరిండెంటెంట్ కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తుగ్గలి: మండలంలోని జొన్నగిరి జెడ్పీహెచ్ఎస్ మైదానంలో జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్, రామాపురం సర్పంచ్ కమాలాబాషాతో కలిసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. 47 రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటాలన్నారు. ఎంపీడీఓ సావిత్రి, హెచ్ఎం ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో సర్పంచ్ బోయ సర్వేశ్వరి బాలురు, బాలికల కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అలాగే కటారుకొండలో ఖోఖో, కబడ్డీ పోటీలను హెచ్ఎం గోవిందు రెడ్డి ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో క్రీడా పోటీలను ఎంపీడీఓ రామస్వామి పర్యవేక్షించారు. ఇప్పటివరకు ఐదు ఈవెంట్లలో 70 శాతం క్రీడలు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలో ఇప్పటివరకు క్రికెట్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. షెడ్యూల్ మేరకు రాబోవు రోజుల్లో ఆ మూడింటితో పాటు ఖోఖో, వాలీబాల్ విభాగాలలో పోటీలు జరుగనున్నట్లు అధికారులు తెలిపారు. వెల్దుర్తి బాలుర హైస్కూల్ మైదానంలో బుధవారం క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎంపీడీఓ శ్రీనివాసరావ్, జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న పర్యవేక్షించారు.

హొళగుంద: మండల కేంద్రంలో ఆటల పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ప్రారంభించారు. వాలీబాల్ పోటీల్లో పలు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. అతిథులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం, పెరవలి గ్రామాలలో క్రీడలను ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, విజయుడు, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ మానసికోల్లాసాన్ని కలిగించే క్రీడలను యువత సద్వినియోగం చేసుకొని ప్రతిభ చాటాలన్నారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు సంజప్ప, రంగ తదితరులు ఉన్నారు.



మద్దికెర: కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

క్రీడాస్ఫూర్తితో రాణించాలి



ఆలూరులో విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న తెర్నేకల్ సురేందర్‌రెడ్డి

ఆలూరు: యువత క్రీడాస్ఫూర్తితో రాణించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా జేసీఎస్ కో-ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం రాత్రి వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో పోటీపడ్డారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన జట్లలో జెడ్ కబడ్డీ జట్టు జిల్లా స్థాయిలో విన్నర్‌గా నిలవడంతో బుధవారం ఆయన రూ.30 వేలను మొదటి బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఆటల ద్వారా స్నేహ సంబంధాలు పెంచుకోవచ్చన్నారు. ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపయోగ పడుతాయని చెప్పారు. గ్రామ సర్పంచ్ అరుణకుమార్, ఏబీఎం చర్చి సంఘం పెద్దలు, ఎంపీటీసీ సభ్యులు నామాల శ్రీనివాసులు, ఈరన్న, రాఘవేంద్ర, పులి, నరేష్, పీఈటీ నాగేంద్ర తదితరులు ఉన్నారు.

చలి వేళ జాగ్రత్తలు పాటించాలి

హాలహర్వి: గత రెండు రోజులుగా చలితీవ్రత పెరిగిందని, రాత్రివేళ చలిగాలులు వీస్తుండడంతో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి తిమ్మన్న సూచించారు. ఈ మేరకు బుధవారం ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఆయన పలు సూచనలు చేశారు. చిన్నారులు, వృద్ధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శరీరాన్ని పూర్తిగా కప్పేలా చలికోట్ లేదా ఉన్ని దుస్తులను ధరించాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలుంటే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు.

కూలీల సంఖ్య పెంచండి

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని ఇన్‌చార్జ్ ఏపీఓ శేషిరెడ్డి ఆదేశించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో ఆయన బుధవారం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలతో సమావేశం నిర్వహించారు. మండలంలో కేవలం 20 శాతానికి మించి కూలీలు పనులకు రావడం లేదన్నారు. గ్రామాల్లో పని అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలన్నారు. ఆయా గ్రామాల సీనియర్ మేటీలు పనుల కల్పనకు కృషి చేయాలని సూచించారు.

స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల: మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న జీనియస్ గ్లోబల్ స్కూల్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిది, ఆర్‌యూఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘాల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఈఓ రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో దాదాపు 700మంది విద్యార్థులు చదువుతున్నారని, పెట్రోల్ బంక్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు మధు, తిరుమల, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

కృష్ణగిరి: కల్లూరు మండలం కేంద్రం, పార్వతినగర్‌కు చెందిన ఉప్పరి శ్రీలతను కృష్ణగిరి మండలం మాదాపురానికి చెందిన భర్త, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నట్లు బుధవారం కృష్ణగిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాల మేరకు బాధితురాలికి, ఉప్పరి మధుతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల పిల్లలు పుట్టలేదని, అదనపు కట్నం తీసుకురమ్మని భర్త, ఆ కుటుంబ సభ్యులు వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసింది. శ్రీలత ఫిర్యాదు మేరకు ఆమె భర్తతో పాటు మరో ఐదుగురు కుటుంబ సభ్యులపై వేధింపుల కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

ఎమ్మిగనూరురూరల్: పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే సెక్టోరల్ అధికారులు తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో తాలుకా స్థాయి సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా ఇప్పటి నుంచే ఎటువంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ కేంద్రాలు, ఇతర సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉన్నాయా? లేవా? ఏమైనా ఇబ్బందులుంటే సరిచేసుకోవాలన్నారు. ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎన్నికల డీటీ గురురాజారావు, సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు



బి.అగ్రహారంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

గోనెగండ్ల: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండలంలోని బి.అగ్రహారం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. అల్లరి మూకలు ప్రవర్తన మార్చుకొని ప్రశాంత జీవనం గడపాలన్నారు. మద్యం సేవించి గొడవలు సృష్టించే విధంగా నడుచుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరానికి కృషి చేస్తామన్నారు. సీఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ తిమ్మారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



బిల్లేకల్లులో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఆస్పరి: సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని పుప్పాలదొడ్డి, కై రుప్పల, బిల్లేకల్లు గ్రామాల్లో బుధవారం ఆ పార్టీ జెండాను సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ నగరంలో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి పేదల కోసం సీపీఐ అనేక పోరాటాలు చేసిందన్నారు. సీపీఐ నాయకులు నాగేంద్రయ్య, శరవన్న, విరుపాక్షి, అంజినయ్య, శివన్న, క్రిష్ణమూర్తి, శ్రీనివాసులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ఏర్పాటు



గజ్జహళ్లి దళితవాడలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: చాలాకాలంగా సీసీ రోడ్డు లేక ఇబ్బందులు పడ్తున్న గజ్జహళ్లి దళితవాడ సమస్యను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాలతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పరిష్కరించారు. మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో కాలనీలోని చర్చి నుంచి ఆదోని రోడ్డు వరకు దాదాపు 110 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించారు.ఈ పనులను బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, కెంచప్ప, మల్లికార్జున శివన్న, హనుమప్ప, ఉరుకుందప్ప, మల్లయ్య సాయిబేష్ తదితరులు పరిశీలించారు. సీసీ రోడ్డు ఏర్పాటు కావడంతో కాలనీవాసులు మంత్రి గుమ్మనూరు జయరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ మద్యం ధ్వంసం

ఆదోనిరూరల్: వివిధ కేసుల్లో ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన అక్రమ మద్యాన్ని బుధవారం రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మొత్తం 20 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 158 లీటర్ల సారా, 91 కేసుల్లో పట్టుబడిన 24,404 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను జిల్లా ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు చెప్పారు.

వ్యాపార స్థలంలో జెండావిష్కరణ వద్దు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పాత బస్టాండులో బీజేపీ శ్రేణులు, చిరు వ్యాపారుల మధ్య మూడు రోజులుగా లొల్లి కొనసాగుతోంది. స్థానికంగా చిరు వ్యాపారులు వ్యాపారం చేసుకునే స్థలంలో బీజేపీ మహిళా నాయకురాలు పార్టీ జెండావిష్కరణ చేసే నిమిత్తం కట్ట కట్టించగా గంటల వ్యవధిలోనే గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. కట్టను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులనాశ్రయించారు. ఇదిలా ఉండగా తాము వ్యాపారాలు చేసుకునే చోట బీజేపీ జెండా కట్ట నిర్మాణానికి ఒప్పుకోమని వ్యాపారులు బుధవారం ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డికి ఫిర్యాదు అందించారు. సీపీఐ నాయకులతో కలిసి ఎంపీడీఓ శ్రీనివాసరావ్‌కు సైతం ఫిర్యాదు అందించారు. జెండా ఏర్పాటు చేస్తే తమ వ్యాపారాలు దెబ్బతింటాయని సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టి పరిస్థితులు చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

పింఛన్ల వెరిఫికేషన్ పూర్తి చేయండి

కృష్ణగిరి: కొత్తగా పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను పక్కాగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ రామస్వామి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో మాట్లాడారు. మండలంలోని 14 సచివాలయాల ద్వారా నూతన పింఛన్ల కోసం 102 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు 99 దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి చేశామని, మిగతా వాటిని నేడు పూర్తి చేస్తామన్నారు. దరఖాస్తులదారుల పూర్తి ఆధారాలతో కూడిన పత్రాలు సేకరించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల-2 పూర్వ విద్యార్థులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు విరాళం అదించినట్లు హెచ్ఎం సత్యనారాయణ బుధవారం తెలిపారు. 1972-73 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఈ నెల 10వ తేదీన జరిగిన అపూర్వ సమ్మేళనంలో పాల్గొని పాఠశాలకు సీసీ కెమెరాలు వితరణ చేస్తామని మాట ఇచ్చారన్నారు. ఇందులో భాగంగానే నాలుగు సీసీ కెమెరాలకు అయ్యే నగదును అందించినట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.